కథానిక

# ఎవరు సమర్థులు?

నిట్టల శ్రీరామమూర్తి

రామం కాలేజీనించి తిరిగివస్తూంటే బజారు మలుపులో కనిపించాడు బాబాయ్. ఎర్రగా లావుగా పొడుగ్గా చేయెత్తు మనిషి బాబయ్య. ఖద్దరు లాల్చీ, ఖద్దరు పంచా, నోట్లో లావుపాటి చుట్టా, కత్తెర మీసాలూ, నెత్తిమీద క్రాపుగా వుండాలో గుండుగా వుండాలో అర్థం కాక తికమకపడి అట్టే వుండి పోయిన ఏ దారి మధ్య పచ్చికబయల్లాంటి పొట్టి బిరుసు వెంట్రుకలూ, చేతిలో బట్టలున్న చిక్కంసంచీ, రెండో చేతిలో బరువుగా నేతిడబ్బా, చంకలో గొడుగూ నవ్వు మొహంతో వెనక్కి తిరిగాడు 'బాబాయ్' అన్న రామం పిలుపు విని. చుట్ట రెండు గట్టి పీల్పులతో అవతల పారేసి "ఏంరోయ్ బాబ్జీ. అంతా కులాసాగా వున్నారా?" అన్నాడు.

ప్రయాణం చేసి వస్తూన్న మనిషిని "ఎప్పుడు రావటం" అనటం, ఎదురుగుండా నిక్షేపంలా రాయిలావున్న మనిషిని చూసి "కులాసాగా వున్నారా" అనడం, సంభాషణకి మాటలు దొరక్కపోతే "ఏమిటి విశేషాలు" అని వెర్రి మొహం వేయటం (విశేషాల్లేవని తెలిసి కూడా) రామానికి సుతరామూ నచ్చవు. అవి అర్థంలేని, అనాదిగా వచ్చే ఆచారాలని అతని విశ్వాసం. అంతేకాకుండా మాటల్లో, వేషంలో అభిప్రాయాల్లో అభిరుచుల్లో మామూలుకంటే భిన్నంగా వుండే ఓ క్రొత్తదనం దానికి అర్థం వున్నా లేక పోయినా సరే-అలవాటు చేసుకునే నవ్యకవుల సంప్రదాయం రామానిది.

"ఆఁ" అని ముక్తసరిగా అంటూ కూడా నడిచేడు రామం.

"సంచీ ఇలా ఇయ్యి" అందామనుకున్న రామం ప్రయత్నం మధ్యలోనే ఆగిపోయింది. ఓ చేత్తో కాలేజీ బుక్సు, మాంచి టక్కప్‌లో వున్న తను చిక్కంపుచ్చుకోవడం నామోషీ అనిపించింది.

"అదేమిటి బాబాయ్ ఏ రిక్షాయేనా ఎక్కకుండా నడిచే వచ్చేస్తున్నావ్" అంటూ రిక్షావాణ్ణి కేకేసేడు. ఫలానా రామంగారి బాబాయ్ సామానులతో సహా బజారు వెంబడి నడిచి వస్తున్నాడంటే రామానికి తలకొట్టినట్లుంది. తన స్నేహితులు ఈ పళంగా చూస్తే ఏమనుకుంటారు! కాని బాబాయికేం తెలీదు. ఎవరేనా ఏమేనే అనుకుంటారనేనా లేదు" అనిపించింది రామంకి.

"బండెందుకురా నాకు? మైళ్ళకొద్దీ నడవటం మాకు అలవాటే. మీ పట్నవాసం వాళ్ళు సుకుమార్లు కాబట్టి బండీ బస్సూ ఎక్కుతారు గాని" అంటూ చరచరా ముందుకు నడిచేడు బాబాయి. లోపలి అయిష్టాన్ని అణచుకుంటూ తెచ్చిపెట్టుకున్న నవ్వుతో అనుసరించాడు రామం. దిలీప్ కుమార్ క్రాపులా తన క్రాపుండాలనే కోరికను లెక్కచేయకుండా అంటకత్తెర వేయమని మంగలికి ఆర్డరిచ్చే తండ్రి ధోరణికి బాధపడుతూ తన తలను నిస్సహాయంగా మంగలివాడికి అప్పచెప్పే కుర్రాడి మొహం పెట్టి. దారి పొడుగునా ఇంట్లో ఒక్కొక్కరి గురించీ అడుగుతూనే ఉన్నాడు బాబాయ్.

పొద్దున్నే హోటలుకు బయలుదేరారు. బల్ల దగ్గర కూర్చుంటూ "ఏయ్ అయ్యర్ ఇల్లారా" అని ఓ కేక పెట్టాడు బాబాయి. రామానికి ఎంతో సిగ్గువేసింది. "అంత మోటుగా పొలికేక పెట్టక పోతే నెమ్మదిగా పిలవకూడదా" అనిపించింది. ఎవరేనా నవ్వేరేమో అని సిగ్గుతో ఇటూ అటూ చూసేడు.

ఇవతలకి వచ్చాక "బాబాయి, బాజారుకి ట్రాంలో పోదాం" అంటూ ట్రాం స్టాపు దగ్గరకు తీసుకు వెళ్ళేడు రామం.

"ఎందుకురా, శుభ్రంగా నడిచిపోక" అంటూ ఏమనుకున్నాడో ఏమిటో కూడా వచ్చాడు

బాబాయి. ఒక ట్రాం క్రిక్కిరిసిపోయి ఆగకుండానే వెళ్ళిపోయింది. "ఏమోయ్, ఆపు చెయ్యి" అని నిక్కచ్చిగా చెయ్యెత్తి గొడుగు అడ్డంగా చాపుతూ ట్రాం లైను దగ్గరగా అడుగులేసాడు బాబాయ్ కంగారుగా. ఆ హడావిడిలో ట్రాం క్రింద పడిపోతాడేమో అని భయం వేసింది అక్కడి ప్రజకి (రామంతో సహా). చుట్టూవున్న వాళ్లు నవ్వుతున్నారేమో అని అభిమానం కలిగింది రామానికి. "అదేమిట్రా ఆపమంటే అల్లాతోలుకు పోతాడేం వాడినవ్వాలు రెగలెయ్యా" అన్నాడు బాబాయి. ప్రక్కనేవున్న ఇద్దరు సూటుధారులు నడుస్తున్న ట్రాంని షోగ్గా పరుగెత్తుకుంటూవచ్చి ఎక్కారు. "వారి అఘాయిత్యం కూలా, అదేం సాహసంరా? బండిక్రింద పడిపోటానికి" అని నొచ్చుకున్నాడు బాబాయి.

"పరవాలేదు బాబాయ్ రోజూ తిరిగేవాళ్ళకి మాకు అలవాటే. అదీ ఓ ఫ్యాషన్ ఈరోజుల్లో" అన్నాడు రామం.

మళ్ళా ఓ ట్రాం వాళ్ళనివదిలేసి ఆగకుండా వెళ్ళిపోయింది.

"చూశావురా బాబ్జీ, ఇంత సేపూ కాళ్లలాగేటట్లు నిలబడి దీనికోసంచూడ్డం, అది తుర్రుమని పారిపోడం! నడిస్తే ఈపాటికి బజారంతా చుట్టేవద్దుంకదా" అన్నాడు బాబాయి నీరసంగా.

"ఎప్పుడూ ఇల్లావుండదు బాబాయ్. ఒక్కొక్కరోజు రద్దీ అల్లా వుంటుంది" అని రామం సమాధానం చెప్తూండగానే ఇంకో ట్రాం వచ్చింది, ఇద్దరూ ఎక్కీఎక్కుతూండగానే కదిలింది. బాబాయి గొడుగుతో సహా ముందున్న వాళ్ళమీద పడడం వాళ్లింకా ముందుకి పడడం, అదృష్టవశాత్తూ ఆ చంటిపిల్ల తల్లి వీళ్ళ త్రొక్కులాటలో పడి నలిగిపోకుండా తప్పుకోవటం జరిగింది. ఈ సర్దుకోటంలో బాబాయి చంకలో గొడుగుకొస ఆ ప్లీడరుగారి సగం నెరసిన ఫ్రెంచి కట్టుమీసాన్ని పరామర్శ చేయటంతో ఆయన ఎదురుగావున్న అమ్మాయిల్ని చూడ్డం మానేసి, ప్రస్తుత ప్రపంచంలోపడి బాబాయికేసి ఎగాదిగా చూడ్డం మొదలెట్టేడు. ఈలోగా గొడుగు రెండోకొస, ఈ సందడి సావకాశం తీసుకుని మిగతావాళ్ళకి దారిచ్చే వంకతో ఎదుటి కాలేజీ గరల్స్‌కి మరీ దగ్గరగా ఆనబోతూ నిలబడే బ్యాంకి గుమాస్తా కోటుమెడకి తగులుకుని ఆయన గారిని న్యాయంగా నిల్చోవల్సిన స్థానంలో నిల్పింది.

"పైన కమ్మిపట్టుకో బాబాయ్" అని కేక వేసేడు రామం బాబాయి చేసే గందరగోళానికి నలుగురూనవ్వుతున్నారేఅని సిగ్గుపడుతూనే. దానికి తగ్గట్టు రామానికి ఎదురుగుండా సీటులో ముగ్గురు కాలేజీ గరల్స్ కూడా వున్నారు. వాళ్ళని చూస్తూంటే బాబాయి గొడుగుతో తన ప్రక్కన అలా నించోటం రామం ఫ్యాషనబులు ఆలోచనలకి గొడ్డలి పెట్టులా వుంది.

ఇంక బజార్లో బాబాయి ఒక్కొక్క షాపు షోరూముకేసీ వింతవింతగా చూడటం ఆ అద్దంలో గ్లాసుది తన ప్రతిబింబం దీక్షగా చూసుకుని మీసాలు సద్దుకోవటం రామానికి చాలా పరాభవంగా వుంది. షాపులో ఆయన గంటలకొద్దీ బేరమాడి అక్కర్లేనివీ కావాల్సినవీ మారుమూలల నుంచి తెప్పించిచూసి- ఉన్న వెరైటీలన్నీ చూసి సంతోషిద్దాం మాత్రమే అనుకుని వచ్చేరేమో అనే దురభిప్రాయం షాపువాడికి కలిగించేటట్లు చాలాసేపు తటపటాయించి చివరికి ఏవీ కొనక కొనకుండా మళ్ళీ వస్తామని షాపువాడిని మభ్యపెట్టి వెళ్లిపోరావటం బేరమాడితే, ఇంకా రకాలు చూపించమంటే వాడు ఏమనుకుంటాడో అని చూపించదలచుకున్నా వద్దంటూ, ఉన్నబట్టనే చెప్పిన ధరకే కొనేసే రామం మొహమాటానికీ నాగరికతకూ తీరని అవమానంగా బాధపడింది రామం "సొసైటీ" హృదయం.

సాయంత్రం ఎయిర్ కండిషన్ రూములో శివస్వామి హోటల్లో బజారుశ్రమ తీర్చుకుంటున్నారు యిద్దరూ. చమ్చాలకి స్వస్తిచెప్పి చేతులతో ఉపక్రమించేడు బాబాయ్. రామం ఏమీ అనలేకపోయాడు. వెయిటర్ల ముసిముసినవ్వులు చూసి రామంకూడా నవ్వుమొహం పెట్టాడు. "నేనూ మీలోవాడినే సుమా" అనే అర్థం వచ్చేటట్లూ, బాబాయి చర్యలతో తనకేమీ సంబంధముగాని నిమిత్తంగాని లేనట్లూ. బాదంగీరు త్రాగబోతూ గడ్డిపుల్ల గిరవాటేసిఒక్క గుక్కలో గ్లాసుడూ ఖాళీచేసి అందరికీ వినబడేటట్లు

బాబాయి త్రేనుస్తుంటే రామానికి కడుపులో దేవినట్లుంది.

గోరుచుట్టుపై రోకటిపోటులాగా ఆయన కండువాతో మీసాలు తుడుచుకుని, చుట్టతీసి చివరనులిమి, కొసకొరికి కాల్చే ప్రయత్నంలో అగ్గిపెట్టికోసం అమాయికంగా వెతుకుతూండగా రామం ఇక వుండబట్టలేక పోయాడు. సొసైటీలో తన అభిజాత్యాన్ని నులిమి దహించి మసిచేసే యమదూతలా కనిపించాడు బాబాయ్. లేని ధైర్యం తెచ్చుకుని తెగించి అన్నాడు "ఇక్కడ కాల్చకూడదు బాబాయ్" అని మెల్లిగా.

"చంపేశావు కాల్చకపోతే ఎల్లా" అంటూ ఆయన అగ్గిపెట్టి తీస్తూంటే బిక్కుబిక్కుమంటూన్న రామం హృదయం ఆ అగ్గిపెట్టిలోపుల్లలు లేకపోవటం చూసి కాస్త కుదుట బడింది. ప్రక్క టేబిల్ దగ్గర కూర్చున్న వారిని అగ్గిపెట్టి అడగబోయి బాబాయి ఎందుకో మానేసేడు రామం అదృష్టవశాత్తూ. వెయిటరు బిల్లు చెల్లించి చిల్లర ప్లేటులో పెట్టి రామానికిచ్చాడు. రామం రెండు అణాలు ప్లేటులో వదిలివేసి మిగతా చిల్లర తీసుకుని లేచాడు వెళ్ళిపోడానికి.

"అరే బాబ్జీ రెండణాలు ప్లేటులో మర్చిపోయావురా" అంటూ బిగ్గరగా కేకవేసేడు బాబాయి కుర్చీలోంచే ప్లేటుతియ్యబోయే వెయిటరుకేసి కొఱకొఱా చూస్తూ. రూములో అందరూ అటుకేసి చూశారు బాబాయిపైన కోపంతో బాబాయి తెలియని తనానికి ఏమీచెయ్యలేని నిస్సహాయతతో విసుగును లోలోపల అణచుకుంటూ పైకి రూములోని సొసైటీ పెద్దమనుష్యుల్ని క్షమించమనే ధోరణిలో నవ్వు మొహం పెట్టి అన్నాడు రామం.

"అవి అల్లా వుంచేయి బాబాయ్. వెయిటర్‌కి అల్లా వదిలేస్తాంలే" అని మెత్తని కోపంతో నెమ్మదిగా పట్టిపట్టి మాట్లాడుతూ. తను బిల్లు చెల్లించింది బాబాయి డబ్బుల్తోనని ధ్యాసైనా లేదు రామానికి ఆ సమయంలో. ఈ పద్ధతులంటే ఏమిటో ఎరగని బాబాయి అమాయికంగా "సరే నీయిష్టం" అంటూ "ఆ రెండణాలకి అరడజను చుట్టలేనా వచ్చునుకదా" అనే ఆలోచనకి గుడ్‌బై కొట్టి వాటర్ బేసిన్‌పైని అద్దంలో మొహం చూసుకుని మీసాలు సవరించి కండువాతో మొహం తుడుచుకుంటూ కిర్రుచెప్పుల చప్పుడుతో బయటికి నిష్క్రమించాడు రామం వెనకాలే. ఆ చెప్పుల చప్పుడు రామం నాగరికతపై సమ్మెటపోటులా వుంది.

"ఇంక ఇంటికిపోదామా" అన్నాడు రామం ఇక భరించలేక.

"సినీమా చూద్దామన్నావు కదరా పోదాం పద ఏం శాశ్వితం? అయినా పట్నం వచ్చాక నాలుగూచూసి నాలుగురాళ్ళు వదుల్చుకుంటేనేకాని తోచదు" అన్నాడు బాబాయి అమాయికపు నవ్వుతో తన భారీతనాన్ని తెలియజేస్తూ.

తాను ఉదయమే సినీమా ప్రస్తావన తెచ్చినందుకు తనలోనే తిట్టుకుంటూన్న రామం. బాబాయి ఆఖరిమాటలు విని తను బాబాయిచేత అంత ఖర్చు పెట్టించి సుఖం అనుభవిస్తూ పైగా బాబాయి తెలియని తనానికి విసుక్కోవటం అన్యాయమేమో అనిపించింది.

"సరే పోదాం పదండి" అన్నాడు.

ఇద్దరూ సినీమాహాలులోకి వెళ్ళేసరికి అప్పుడే ఆట మొదలెట్టేసారు. చీకట్లో హాలులో సీటు కోసం బాబాయి చాలా తికమకలుపడి "తప్పుకోండయ్యా కొంచం దారి యివ్వండి" అని కేకలువేస్తూ ఆఖరికి ఓ సీటులో చతికిలబడ్డాడు. "ఎక్కడున్నావురా బాబ్జీ" అంటూ అరుస్తూ. అందరూ వింతగా రామంకేసీ ఆయనకేసీ చూసారు. కాని రామం ఈపాటికి మొండికత్తేడు. సినీమాజరుగుతూన్నంతసేపూ బాబాయి "అరే బాబ్జీ దాని పేరేమిట్రా (హీరోయిన్‌ని చూపించి) ఆ రుష్టుతల వెధవ ఎవర్రా" అంటూ కథ సంగతీ, ఎల్లా నడుస్తున్నదీ, ముందేమవుతుంది అన్నీ అడిగేసు చిన్నపిల్లవాడిలా. మధ్యలో తనవూరి సంగతీ లోకాభిరామాయణం గట్టిగా రామంతో ముచ్చటించ బోయేసరికి "మాట్లాడొద్దనే" అర్థం తెలియజేసే తీవ్రమైనచూపుల్తో ముందువరసలోని ముగ్గురు గరల్సు స్టూడెంట్సు వెనక్కి చూడగానే రామానికి ఎంతో సిగ్గువేసింది.

మర్నాడు పొద్దున్నే బాబాయి వెళ్ళిపోయాడు సెలవులకి రామాన్ని తప్పకుండా తన వూరు రమ్మంటూ. తనపై ఆప్యాయంతు తెలియ

జేసే ఖాళీ నేతిడబ్బా ఓ చేతిలోనూ, బట్టల చిక్కం ఓ చేతిలోనూ చంకలో గొడుగూ— బాబాయి స్వరూపం లీలగా గోచరించింది అరుగు మీద కూర్చున్న రామానికి.

* * *

వేసంగికి రామం బాబాయిగారి వూరు వెళ్ళేడు.

"ఏందోయి బాబ్జీ ఎప్పుడొచ్చావు? అంతా కులాసా అఁ" అంటూ ఎదురుసన్నాహం చేసేడు బాబాయ్.

"ఈ మూడు మైళ్ళూ నడిచేసరికి కాళ్లు లాగేయ్ బాబాయ్" అన్నాడు రామం జోడు విప్పుతూ.

"మరేమనుకొన్నావురా మా వూరు రావటమంటే? ఇక్కడేం ట్రాములా బస్సులా చులాగ్గా ఇల్లా ఎక్కి అల్లా రావటానికి. అయినా ఈ వయస్సులోనే ఆమాత్రం నడవకపోతే ఎందుకు పనికొస్తారురా?" అన్నాడు నవ్వుతూ.

"మా అబ్బాయి రామం మూడుమైళ్ళైనా నడవలేకపోయాడే" అని ఎవరేనా అనుకుంటారేమో అని అభిమానపడలేదు బాబాయి.

పొద్దున్నే రామం లేచేసరికి ఆయన పనసకాయ కొట్టున్నాడు రంపపు పొట్టుకంటె సన్నంగా.

"ఒరేయ్ బాబ్జీ పనసకాయ కొట్తావా" అన్నాడు.

"అదెంతపని బాబాయి ఇల్లా ఇయ్యి" అని రామం కొట్టబోయాడు. చూడ్డానికి అంత సులువుగా అనిపించిందికాని తీరా కొట్టబోయేసరికి ముక్కలుముక్కలుగా పడటం ప్రారంభించింది.

"చాల్లే ఇల్లా ఇయ్యి. పట్నవాసులుకదా మీకేం తెలుస్తుంది పనసకాయకొట్టడం. అయినా ఎప్పుడేనా నువ్వు కొట్టావుగనకనా" అంటూ తిరిగి పుచ్చుకున్నాడు బాబాయ్. బాబాయి ట్రాంలో పడిపోబోయిందానికన్నా తను పనసకాయ కొట్టలేకపోవటం ఎక్కువ అపహాస్యంగా కనిపించింది రామానికి. సిగ్గుపడుతూ చుట్టూ చూసేడు. ట్రాంలో పెద్దమనుష్యుల్లా అరుగుమీదవాళ్లెవరూ నవ్వలేదు.

"స్నానంచెయ్యి రామం" అని కేకేసింది పిన్ని లోపల్నించి. రామం నూతిదగ్గరకి వెళ్ళేడు.

"అలవాటులేని పని. తోడేం పోసుకుంటావురా? మీ పిన్ని గదిలోపెట్టింది వేడినీళ్లు పోసుకో" అని కేకేసాడు బాబాయి అరుగు మీంచి చుట్టచుడుతూ. బాబాయికేక అసహజంగా అనిపించలేదు రామానికి. ఒకటి రెండు బాల్చీలు తోడి చేతులు నొప్పెత్తగానే బాబాయి సలహా అమలుజరిపేడు రామం. తను వాళ్లు మామూలుగా చేసే ఏపనీ చేయలేకపోతున్నానే అని ఆశ్చర్యమూ సిగ్గూ కలిగాయి రామానికి.

బాబాయికోసం అస్తమానూ ఎవరో ఒకరు వస్తూనే ఉన్నారు సలహాకనీ చుట్టముక్కకనీ ఒకటేమిటి? బాబాయికి ఆ ఊళ్ళో ఉన్న పలుకుబడి చూసి బజారో, నేతిడబ్బా, బట్టల చిక్కంతో వెళ్ళే బాబాయిని చూసి జాలిపడ్డ తనని తలచుకుని తనే సిగ్గుపడ్డాడు రామం.

సాయంత్రం పొలంకేసి ఇద్దరూ షికారుకు వెళ్ళేరు. దారిలో చిన్న మోకాలిలోతు కాలువ దాటాల్సివచ్చింది. పట్లాం పైకి ఎగ్గడుతున్నాడు రామం.

"నేను చెప్పలేదురా బాబ్జీ, ఇక్కడ పంట్లాములూ, బూట్సులూ పనిచెయ్యవు. పంచపైకిదోపి కట్టాల్సిందే. అనుమానించక" అన్నాడు బాబాయి. ప్రక్కవాడి చేయి సాయం చేసుకుని దాటాడు రామం.

మరోచోట పంటకాల్వ అడ్డు వచ్చింది. చులాగ్గా ఈ గట్టుమీంచి ఆ గట్టుమీదికి అంగ వేసేడు బాబాయి. రామానికి ఆ వెడల్పు తాహతుకు మించిన పని. దోనెమీంచే పాలికాపుచేయి వూతగా బ్రహ్మాండం మీద దాటాడు. తనుదాటలేక పోయినందుకు ఎవరూ నవ్వలేదు. బాబాయికేం అణచి పెట్టుకునేంతకోపం రాలేదు. తన చేతకాని తనానికి తనకే సిగ్గేసింది.

"బాబుగారు మరిల్లాకష్టపడలేరు. పట్నంలో సుకుమారంగా పెరిగేరు మరి" అంటూ సానుభూతితో మాట్లాడేరు అందరూ.

అంతా మామిడిచెట్టు క్రింద కూర్చున్నారు. రామం పట్లాం మాసిపోతుందేమో అని ముందు

భయపడి, సందేహించి మళ్ళీ బాబాయి ఏమనుకుంటాడో అని ధైర్యంచేసి క్రింద చతికిలబడ్డాడు. కొబ్బరి బోండాలు తీయించాడు బాబాయి. తను ఒక బోండాం తాగేసరికి మిగిలినవాళ్లు తలో నాలుగుబోండాలూ తాగేశారు. తనకి చొక్కా నిండా, పట్లాం నిండా అయింది. గుంజు తింటూంటే మూతి అంతా అయింది. మరి వాళ్ళందరూ వింతగా తనకేసి చూడలేదు ఎయిర్‌కండిషను రూములోవాళ్లలాగ. బాబాయి ఏం బాధపడలేదు అతను బాదంగీరులో గడ్డిపుల్ల రవాటేస్తే తను బాధపడినట్లు.

ఎదురుగుండా రైతు పొలం దున్నుతున్నాడు "నేనోసారి ట్రై చేస్తాను బాబాయ్" అన్నాడు రైతుకేసిచూస్తూ రామం. ఆ ఇంగ్లీషుముక్క అర్థంకాకపోయినా సందర్భం గ్రహించాడు బాబాయి.

"అల్లానే కానివ్వవోయ్" అని "ఒరేనాగా మావోడో చెయ్యేస్తాట్ట" అని కేకేసాడు. తను నాగలిమీద చెయ్యేసి రెండు అడుగులేసేసరికి బెడ్డల్లో కాళ్ళుకొట్టుకుపోయాయి. చెయ్యిరాపిడికి మండి బొప్పర్లు రేగటం ప్రారంభించింది.

"మరేమనుకున్నావురా వ్యవసాయం అంటే?" అని నవ్వేడు బాబాయి.

చీకటిపడింది. ఓప్రక్క కీచురాళ్ళ చప్పుడు. పొలంగట్లమీద నడుస్తూంటే ముందునడుస్తూన్న బాబాయి కిర్రుచెప్పుల చప్పుడు రామం హృదయానికిఎంతో నిబ్బరం కలిగించింది.

మర్నాడు "వెళ్ళొస్తాను బాబాయి" అని ఇంటిమొహంపట్టాడు రామం. దారిలో కలిగింది రామం హృదయంలో ఓ ప్రశ్న — పట్నంలో బాబాయి, పల్లెటూళ్ళో తనూ. ఇందులో సమర్థులెవరని?

---

# క్షణంలో సగం

"శారద"

మనకి నాయకులున్నారు. వాళ్లు కష్టపడి ఒక రకం రాష్ట్రం తెచ్చారు; ఎందుకంటే ఏదీ దానంతటది రాదు గనక అనుకుంటా. అయితే రాజధాని ఎక్కడా అని ప్రారంభమైన తగువు ఈ రోజున ఒకరకంగా శమించినట్లు కనిపించినా ఇంకా కొందరు నాయకులకు (అట్లాగని వాళ్ళింకా అంటున్నారు ఖర్మ!) ఆ సమస్య కలల్లోకి వస్తోందిట. కర్నూలులో డేరాలన్నీ విజయవాడకు పోతున్నట్టూ, విశాఖపట్నంలో పిచ్చాసుపత్రి - కర్నూలుకేసి బయల్దేరినట్లూ, హైకోర్టు ఎటూపోలేక ఆకాశంలో ఉన్నట్టూ కల వస్తోందిట.

పైగా ప్రతి శాసనసభ్యుడికి రహస్యంగా "నీకూ ఓ మంత్రిపదవి ఇస్తాం-నాకోవోటు వెయ్యవూ?" అని ప్రధానమంత్రి కావాలనుకుంటున్న వారినించి ఉత్తరాలు వొచ్చినట్టు కల వస్తోందిట. ఇది రహస్యం.

* * *

కర్నూల్‌లో కాఫీహోటల్సు పెట్టదలచిన వారికి అక్కడి మున్సిపాలిటీ ఏ రకం సౌకర్యాలైనా చూపగలదటగాని, నీళ్ళ సంగతి పట్టించుకోదట. కృష్ణనో, గోదావరినో, అటు మళ్ళించటానికి అక్కడ హోటల్ పెట్టిన అయ్యర్ల మహాసభ ఒకటిచేసి, అట్టి "ఆలోచన" "ప్లాను" వెయ్యగల సమర్థులు వెనకటి "కృష్ణాపెన్నారు ప్రాజెక్టు" మహానుభావులే అని తీర్మానించి వారికే తమ కోరికను సమర్పించినారని తెలుస్తోంది.

* * *

కర్నూలు వెళ్ళగల ఉద్యోగులకు ఒక ప్రత్యేక పరీక్ష పెట్టగలరని గాలివార్త వచ్చింది. ఎటువంటి "సైజు" దోమకాటుకైనా తట్టుకోగల వారికిన్నీ, శిలలనుండి ద్రవాలు తెప్పించగల వారికిన్నీ ప్రత్యేకమైన 'ప్రిఫెరెన్సు' ఇవ్వగలరట.

* * *

ఆంధ్రరాష్ట్రాన్ని ఫ్రాన్సుతో పోల్చారు ఎవరో ఇటీవల; అది ఉద్యోగులను గురించి మాత్రమే గాదట, మంత్రివర్గాలు కూడా ఫ్రాన్సు